క్లుప్తంగా

భీమన్న ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని భీమన్న ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయంలో అర్చకులు అంబేద శంకరయ్య ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఆలయంలో ఆదివారం దేవతల విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. నేడు గణపతి హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కౌటాల గ్రామ అధ్యక్షుడు పెద్దపల్లి హన్మంతు ఉన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



స్టడీసెంటర్ ప్రారంభిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీలో స్టడీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవిలో విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువులో మెరుగుపడాలని, రీడింగ్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీరోజు ఒక గంట రీడింగ్‌కు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నస్రూల్లాఖాన్, సర్పంచ్ వొజ్జల మానిశ్, ఏపీఎం వెంకటరమణ, ఎంపీవో మౌనిక, కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలు మంజూరు చేసేవరకు ఉద్యమిస్తాం'

ఆసిఫాబాద్‌అర్బన్: వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు పోరాటం చేస్తామని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గణపురం మహేష్, రాజశేఖర్‌లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులకు స్థలాలు మంజూరు చేయాలని సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు మద్దతు తెలిపారు. విష్ణుగౌడ్, రవి, జయంత్, ప్రకాష్, జానకీరాం, నాగేందర్, రవీందర్, బాలాజి, భీంరావ్, లింగయ్య, పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



సమ్మె చేస్తున్న వీవోఏలు

కౌటాల: ఐకేపీ వీవోఏలు సమస్యల పరిష్కారానికి చేస్తున్న నిరవధిక సమ్మె 20వ రోజు శనివారం కొనసాగింది. సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమ్మెలో వీవోఏలు రవి, కొండయ్య, మహేశ్వరి, ఇందిరా, పద్మ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	:రామబాణం

కాగజ్‌నగర్

వెంకటరమణ	: రామబాణం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	60
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

పుస్తకాలతో కుస్తీ!



గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

- ఉద్యోగ అభ్యర్థులకు వరం గ్రంథాలయం
- గ్రూప్స్, గురుకులాలే లక్ష్యంగా సాధన
- మండలంలో వందలాది మంది నిరుద్యోగులు

వాంకిడి: ప్రభుత్వ కొలువు సాధించాలనే సంకల్పంతో నిరుద్యోగ యువత పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రతీరోజు తెల్లవారుజాము నుంచి రాత్రి 11 గంటల వరకు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుకుంటూ లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నారు. మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ స్టడీసర్కిల్‌లో నిర్వహిస్తున్న గ్రంథాలయం ఉద్యోగ అభ్యర్థులకు వరంగా మారింది. ప్రతీరోజు 50 మంది అభ్యర్థులు గ్రంథాలయానికి క్రమం తప్పకుండా వచ్చి చదువుకుంటున్నారు. కొంతమంది పట్టణాల్లో గదులు అద్దెకు తీసుకుని చదువుకుంటుండగా మరి కొంతమంది గ్రంథాలయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నారు.

పట్టు వదలని విక్రమార్కుల్లా..

గ్రూప్ 1 పాటు మరికొన్ని ప్రభుత్వ ఉద్యోగాల పేపర్ల లీకేజీలు నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేశాయి. అయినా మండలంలోని అభ్యర్థులు పట్టు వదలని విక్రమార్కుల్లా ప్రభుత్వ కొలువే లక్ష్యంగా చదువుతున్నారు. ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న చాలా మంది ఉద్యోగాలు వదిలేసి చదువుపై దృష్టి సారించారు. ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ఇచ్చిన తేదీలనే ఫైనల్ చేసి పరీక్షలు నిర్వహిస్తారనే ఆశతో నిర్విరామంగా శ్రమిస్తున్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు.

టీఆర్టీ అభ్యర్థులే అధికం..

మండలంలో టీఆర్టీ అభ్యర్థులే అధికంగా ఉన్నారు. డీఎడ్, బీఎడ్ పూర్తి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గతేడాది టెట్ నిర్వహించినా టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల కాలేదు. డీఎడ్, బీఎడ్‌తో పాటు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

వందలాది మంది నిరుద్యోగులు

మండలంలో డిగ్రీ, డీఎడ్, బీఎడ్, పీజీ, బీటెక్, తదితర డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకుని వందలాది మంది యువకులు కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికే పోలీస్‌శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలు పూర్తయ్యాయి. రానున్న జూన్, జూలై, ఆగస్టుల్లో టీఎస్‌పీఎస్సీ పరీక్షలతో పాటు గురుకులాల్లో వివిధ పోస్టుల భర్తీకి పరీక్షలు జరుగనున్నాయి. దీంతో అభ్యర్థులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. వీరికి మండల కేంద్రంలోని గ్రంథాలయం అండగా నిలుస్తోంది. గ్రంథాలయ లైబ్రేరియన్ సదానందం యువకుల ఆసక్తి మేరకు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

ఉపాధ్యాయ కొలువే లక్ష్యం



డిగ్రీతో పాటు డీఎడ్ పూర్తి చేశాను. టెట్‌లోనూ ఉత్తీర్ణత సాధించాను. ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా రెండేళ్లుగా సాధన చేస్తున్నాను. టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన ఉద్యోగాలకు కూడా సన్నద్ధమవుతున్నాను. పరీక్షలు వాయిదా వేయకుండా అనుకున్న తేదీల్లోనే నిర్వహించాలి.

- అక్షయ్ కుమార్, నిరుద్యోగి, వాంకిడి

ఏడాదిన్నరగా గ్రంథాలయంలోనే..



ఏడాదిన్నరగా గ్రంథాలయంలోనే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నాను. ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయంతో ప్రభుత్వ కొలువుపై ఆశలు పెరిగాయి. గురుకులాల్లో లైబ్రేరియన్ ఉద్యోగం సాధించాలని కష్టపడుతున్నా.

- సాయికుమార్, నిరుద్యోగి, వాంకిడి

ప్రణాళికతో చదవాలి



అభ్యర్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళికతో చదవాలి. కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. అప్పుడే ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చు. ప్రతీ అంశాన్ని విశ్లేషనాత్మకంగా అధ్యాయనం చేస్తే సబ్జెక్ట్‌పై అవగాహన పెరుగుతుంది.

- శ్రీనివాస్, సీఐ, వాంకిడి

'జీపీడీపీ'తో మరింత అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ పెందోర్ మోతిరాం

కెరమెరి: జీపీడీపీ (గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్)తో గ్రామాల అభివృద్ధి మరింతగా జరుగుతుందని, తక్షణమే ప్రణాళిక తయారు చేసి ఆన్‌లైన్ చేయాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు కాలంలో ఏఏ పనులు చేయాలి, ఎన్ని నిధులు కావాలి వంటి వివరాలను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇటీవల మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దిన సెంటర్లలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 15 నుంచి 17 వరకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, ఎంపీడీవో సిబ్బంది సుధాకర్, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కుమారి, లత ఉన్నారు.

పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఫ్లాగ్‌షిప్‌లో భాగంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నూతన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల కోసం స్థలాలను పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఈజీఎస్ ద్వారా పని చేస్తున్న కూలీలకు త్వరగా డబ్బులు అందేలా చూడాలని, కొత్త జాబ్‌కార్డులు త్వరగా కూలీలకు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించి వేలాడే విద్యుత్ తీగలను సవరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సోమశేఖర్, పోషమల్లు, పోషయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో బుచ్చన్న, ఏపీఎం రాజ్‌కుమార్, ఎంపీవో అంజద్‌పాషా, ఏఈఈ సోనీ, వాటర్ గ్రిడ్ ఏఈ శ్రీనివాస్, సీడీపీవో తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఒడ్డుగూడలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



సిర్పూర్(టి)లో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఒడ్డుగూడ, కుంచవెల్లి, గిరవెల్లి, చంద్రపల్లి గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, సహకార సంఘం చైర్మన్ కోంద్ర తిరుపతిగౌడ్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. నాణ్యమైన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2060 లభిస్తుందన్నారు. మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, సర్పంచులు పుప్పాల లక్ష్మి, దందెర అమ్మక్క, కారు రాజన్న, లగ్గామ దామోదర్, సీఈవో బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బానెపల్లి బాపు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, సర్పంచ్‌లు యాదిగి బ్రహ్మయ్య, పిప్రె ప్రభాకర్, ఏవో మధులత, నాయకులు చునార్కర్ ఉమాజీ, నగ్రాడె రాజు, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వానాకాలం పంటలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిర్యాణి: మండలంలోని పెర్కపల్లి గ్రామంలో వానాకాలం పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, వరి, పెసర, కంది పంటలతో పాటు చిరుధాన్యాల సాగు, సస్యరక్షణ, ఎరువుల వాడకం, కలుపు నివారణ వంటి అంశాలపై రైతులకు వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం, సహజ పంటల ఉత్పత్తి, రెట్టింపు ఆదాయం పొందేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరి కొనుగోలు, వడ్ల నాణ్యతపై రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, ఏఈవోలు శ్రావణ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామ్మోహన్ రావు

ఆసిఫాబాద్: అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అధికారులు ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీ రాంలాల్, ఆర్ఐ రాజేశ్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 8న మండలంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఓటరు నమోదు, ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువ ఓట్లు ఉన్న అంశంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు పెంచికల్‌పేట్ తహసీల్దార్ సరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

దహెగాం: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మినీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రకృతి వనాల్లో మొక్కలకు నీరు పోయాలని, నర్సరీలో మొక్కలను సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రం తనిఖీ



సూచనలు చేస్తున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను పెంచికల్‌పేట్ తహసీల్దార్ పి. సరిత శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మీసేవా కేంద్రాల్లో వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న చార్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు వచ్చే వినియోగదారులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రయాణం నరకప్రాయం!



అధ్వానంగా బాబాసాగర్ -డబ్బా రహదారి

- అధ్వానంగా మారిన రహదారులు
- పల్లె రోడ్లపై భారీ వాహనాల రాకపోకలు



రహదారిపై వెళ్తున్న భారీ వాహనం

చింతలమానెపల్లి: మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. అధికారుల అలసత్వం కారణంగా రోడ్లన్ని గుంతలమయంగా మారుతున్నాయి. నిబంధనలు అతిక్రమించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రహదారులకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

భారీ వాహనాలతో ధ్వంసం..

చింతలమానెపల్లి మండలం డబ్బా క్రాస్‌రోడ్ నుంచి బాబాసాగర్, చింతలమానెపల్లి, ఖర్జెల్లి మీదుగా గూడెం వరకు మొత్తం 30 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రహదారి కౌటాల, మహారాష్ట్రలను కలుపుతుంది. కాగా ఈ మార్గం భారీ వాహనాల కారణంగా అధ్వానంగా మారింది. కౌటాల మండలంలోని ముత్తంపేట శివారులో కంకర క్రషర్లను ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో నిర్మిస్తున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు ఇక్కడి నుంచి కంకర తరలిస్తున్నారు. మహారాష్ట్రకు భారీ టిప్పర్ల ద్వారా కౌటాల నుంచి బాబాసాగర్, చింతలమానెపల్లి, ఖర్జెల్లి, గూడెం మీదుగా కంకరను తరలిస్తుండడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ రహదారులపై వాహనానికి యాక్సిల్ ఆధారంగా అనుమతులను అనుసరించి ఒక యాక్సిల్‌కు 8టన్నుల చొప్పున తరలించవచ్చని అధికారులు తెలియజేస్తున్నారు. కాని నిబంధనలు ఉల్లంఘించి 35 టన్నుల నుంచి 60టన్నుల లోడ్‌తో ప్రతీరోజు వందల సంఖ్యలో భారీ వాహనాలు పల్లె రహదారులపై రాకపోకలు సాగిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న వాహనాలను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. రహదారి అధ్వానంగా మారడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంత గ్రామాలు గూడెం, చిత్తాం, దిందా, కోయపెల్లి ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం కౌటాల, కాగజ్‌నగర్, ఇతర ప్రాంతాలకు రావాలంటే ఒకే మార్గం ఉంది. కాని ఈ మార్గం గుంతలమయం కావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు దుస్థితిపై ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మినారాయణను వివరణ కోరగా రహదారులపై భారీ వాహనాల నియంత్రణ తమ శాఖ పరిధిలో లేదని సమాధానం ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



భజనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

కెరమెరి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం మండలంలోని గోయగాం గ్రామంలో నిర్వహించిన పరమహంస సద్గురు పూలాజిబాబా 13వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పూలాజిబాబా చేసిన సేవలను కొనియాడారు. నేటి కాలంలో యువత దేవుడిపై విశ్వాసం ఉంచాలన్నారు. అనంతరం భజనల్లో పాల్గొని పాటలు పాడారు. పూలాజిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోడి గ్రామంలో కాత్లె వారి పెర్సాపేన్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, సిద్దేశ్వర్ సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లె, సర్పంచ్ రజిత, జగన్నాథ్, తుల్సిరాం, న్యానేశ్వర్, నాయకులు ఆత్రం భగవంత్‌రావు, నారాయణ, భీంరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ భద్రతా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: విద్యుత్ వినియోగదారులు తగు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చని ఆసిఫాబాద్ డివిజన్ ఇంజనీర్ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని బూర్గుడ సబ్‌స్టేషన్ కార్యాలయంలో సిబ్బందికి భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు భద్రతా సూత్రాలు పాటిస్తూ పని చేయాలని, ఎర్త్ రాళ్లు తప్పనిసరిగా వాడాలన్నారు. ఎక్కడైనా వైర్లు తెగితే వెంటనే సంబంధిత సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్, ఎస్ఎల్ఐ విలాస్, ఎల్ఐ శ్రీనివాస్, ఎల్ఎం సురేష్, రాహుల్, రాజేందర్, సతీష్ తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహార్ సంఘం నాయకులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మహార్ కులస్తులు, అభిమానులు విజయవంతం చేయాలని బౌద్ధ సమాజ్ సంఘం సిర్పూర్ తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం పోస్టర్‌ను శనివారం కౌటాలలోని బుద్ధవిహార్‌లో ఆవిష్కరించారు. ఈనెల 11న తాటిపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘం మండల అధ్యక్షుడు బండురావ్, నాయకులు మధుకర్, శంకర్, ఎమాజీ, గజనాన్, సాయినాథ్, చరణ్‌దాస్, ప్రకాశ్, విలాస్ పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గొల్లగూడలో జరిగిన గొడ్డలి దాడిలో గాయపడిన పోషక్క మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం ఎంపీపీ మల్లికార్జున్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ప్రహ్లాద్, శంకర్ తదితరులు ఉన్నారు.